క్లుప్తంగా

సినారెకు ఘన నివాళులు



సినారె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

నల్లగొండ టౌన్ : పట్టణంలోని పెన్షనర్స్ భవన్‌లో రిటైర్డ్ ఉగ్యోగుల సంఘం ఆధ్వర్యంలో ప్రముఖ సినీగేయ రచయిత, పద్మభూషన్ అవార్డు గ్రహీత సి.నారాయణరెడ్డి 94వ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెల్లా శ్రీశైలం, జి.వెంగల్‌రావు, గజవెల్లి సత్యం, యాద వాసుదేవ్, కె.రామలింగం, జెల్లా పుల్లయ్య, జి.సుధాకర్‌రెడ్డి, చక్రపాణి, నాగేశ్వర్‌రావు, బాలరాజు, కృష్ణయ్య, కత్తుల శంకర్, యాదగిరిరెడ్డి, రమేష్, శేషారెడ్డి, అఫ్జల్, శంకరాచారి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలోని శ్రీరేణుకాఎల్లమ్మ ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవాన్ని గురుజా అశోక్‌స్వామి ఆధ్వర్యంలో బేతోజు సత్యనారాయణ శాస్త్రి సిద్ధాంతిచే మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గణపతి పూజ, స్థాపిత మంటప దేవతాపూజలు, హోమాలు, ధాన్యాధివాసము, సకల దేవాతా హోమాలు, మూల మంత్ర హోమాలు అర్చకులు వేదమంత్రాలతో చేపట్టారు. నేడు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం, శాంతి కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు సిద్దగోని స్వామి, బింగి కొండయ్య, గురుజా రామచంద్రు, క్రాంతికుమార్, మధు, వడ్డేగోని రామలింగయ్య, పసునూరి శ్రీనివాస్, కన్నెబోయిన నర్సింహ ఉన్నారు.

బీఎల్‌ఓ బాధ్యతతో అంగన్‌వాడీలపై అధిక ఒత్తిడి



కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

రామగిరి(నల్లగొండ) : బీఎల్‌ఓ బాధ్యతతో అంగన్‌వాడీలపై అధిక పనిఒత్తిడి కలుగుతుందని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్‌ను కలిసి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పలు సెంటర్లలో ఆయాలు లేక టీచర్లు అన్ని రకాల విధులు నిర్వహించాల్సి వస్తుందన్నారు. అయినా కష్టపడి బీఎల్‌ఓ విధులు నిర్వర్తించినా పారితోషికంలో వ్యత్యాసం ఉందన్నారు. ప్రీప్రైమరీ సెక్షన్‌లో అంగన్‌వాడీ టీచర్లను నియమించాలని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘం అధ్యక్షురాలు జొన్నలగడ్డ వెంకట్‌రమణ, కార్యదర్శి మజ్జిగ సునిత, ట్రెజరీ పుట్ట సునిత తదితరులు ఉన్నారు.

కంటి వైద్యశిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

నకిరేకల్ : మండలంలోని నోముల గ్రామంలో నకిరేకల్ లయన్స్ క్లబ్, నవ్య క్లబ్‌ల ఆధ్వర్యంలో సూర్యాపేట లయన్స్ కంటి ఆసుపత్రి సహకారంతో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం, డయాబెటిక్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి ఆసుపత్రి విజన్ టెక్నీషియన్ స్వాతి, క్యాంప్ ఇన్‌చార్జ్ వీరేంద్రచారి ఆధ్వర్యంలో 80మందికి కంటి, షుగర్, బీపీ పరీక్షలు చేశారు. ఆయా క్లబ్‌ల అధ్యక్షులు రేపాల సతీష్, ఎస్.రమాదేవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుంచం రమణమ్మసోమయ్య, క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి, ప్రతినిధులు ఎర్ర శంభులింగారెడ్డి, సూర్యచంద్రరావు, డాక్టర్ వీరబ్రహ్మం, ఎస్.రాంమోహన్‌రావు, దేవరశెట్టి పెద్ద శ్రీనివాస్‌లు, యాదగిరిరెడ్డి పాల్గొన్నారు.

టీబీ వ్యాధిగ్రస్తులకు ఆహార ప్యాకెట్ల పంపిణీ

నాంపల్లి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం టీబీ వ్యాధిగ్రస్తులకు ఆసుపత్రి సిబ్బంది ఉచితంగా ఆహార ప్యాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ భవానీసాగర్ మాట్లాడారు. వ్యాధిగ్రస్తులకు ఆరు నెలల వరకు ఆహారం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో తరుణ్, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలకు ప్రహరీలు కరువు!

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్న వైనం
- ఆవరణలో సంచరిస్తున్న మూగజీవాలు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



చిట్యాల : పెద్దకాపర్తి జెడ్పీహెచ్ఎస్‌లో తరగతి గదుల వెనక లేని ప్రహరీ



చిట్యాల: ఎలికట్టెలోని సుందరయ్యనగర్‌లో ప్రహరీ లేని ప్రాథమిక పాఠశాల

చిట్యాల : పలు ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు కరువయ్యాయి. దీంతో పాఠశాలలకు, పాఠశాలల్లోని విద్యార్థులకు రక్షణ లేకుండా పోతుంది. మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్‌కు తరగతి గదులకు రెండు వైపుల ప్రహరీల నిర్మాణాలు లేవు. దీంతో పాఠశాల ఆవరణలోకి విద్యార్థులకు తరగతులు జరిగే సమయంలోనే వీధి కుక్కలు, ఇతర మూగజీవాలు వస్తున్నాయి. అంతేకాకుండా తరగతి గదుల వెనకవైపున ప్రహరీ లేకపోవడంతో అక్కడ పంట పొలాలతో పాటు చెత్తాచెదారం ఉండడంతో విషపురుగులు సంచరిస్తున్నాయి. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈ పాఠశాలకు సరైన ప్రహరీ లేకపోవడంతోనే తరగతి గదుల్లోని కంప్యూటర్లను దొంగలు ఎత్తుకెళ్లిన సంఘటనలు చోటు చేసుకున్నాయ. ఇక ఎలికట్టె గ్రామంలోని సుందరయ్యనగర్‌లో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు మూడు వైపులా ప్రహరీ నిర్మాణాలు చేపట్టలేదు. దీంతో కంపచెట్లతో నిండిపోయి విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. అంతేకాకుండా పాఠశాల సమయం అనంతరం పలువురు ఈ పాఠశాల ఆవరణలోకి వచ్చి పాఠశాలలోని వస్తువులను ధ్వంసం చేస్తున్నారు. అంతేకాకుండా పలు అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత విద్యా శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి పాఠశాలలకు ప్రహరీలు నిర్మించాలని విద్యార్థులు వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రహరీ నిర్మాణం వెంటనే చేపట్టాలి



మా గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ రెండు వైపుల ప్రహరీల నిర్మాణాలు లేవు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ప్రహరీల నిర్మాణాలకు అవసరమైన నిధులు మంజూరు చేసి వెంటనే నిర్మించాలి. ప్రహరీ లేకపోవడంతో రాత్రి సమయంలో అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. నిర్మాణాలు చేపట్టేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలి.

– నీలకంఠం నరేష్, ఎస్ఎంసీ మాజీ వైస్ చైర్మన్, పెద్దకాపర్తి

బీసీ రిజర్వేషన్ల అమలును అడ్డుకుంటే సహించం



సమావేశంలో మాట్లాడుతున్న దీపేందర్

నల్లగొండ టౌన్ : బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలును ఏ పార్టీ అడ్డుకున్నా సహించేది లేదని బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టికోలు దీపెందర్ అన్నారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల పెంపుపై బీజేపీ, బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీఓ ఇచ్చినా, ఆర్డినెన్స్ తెచ్చినా కోర్టుల్లో నిలవదనే గోబెల్స్ ప్రచారాన్ని మానుకోవాలన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, కేంద్ర మంత్రి బండి సంజయ్ బీసీ రిజర్వేషన్లపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లను 42శాతానికి పెంచుతూ అసెంబ్లీలో బిల్లు ఆమోదించి గవర్నర్ ద్వారా కేంద్రానికి పంపి 3నెలలు గడిచిందన్నారు. దానికి ఆమోదం తెలపకుండా బీసీలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి ఎలిజాల వెంకటేశ్వర్లు, బోళ్ల నాగరాజు, వనం వెంకటేశ్వర్లు, శేరి రవీందర్, నారగోని వెంకట్, జె.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

102 అంబులెన్స్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



పీహెచ్‌సీకి 102 అంబులెన్స్ వాహనంలో వచ్చిన గర్భిణులు, బాలింతలతో వైద్యసిబ్బంది

శాలిగౌరారం : మండలంలోని గర్భిణులు, బాలింతలు 102 అంబులెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి సూర్యశిల్ప అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో 102 అంబులెన్స్ సేవల గురించి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. మండలానికి చెందిన గర్భిణులు, బాలింతలను ప్రతీ మంగళవారం, శనివారం వైద్య పరీక్షల కోసం ఉచితంగా స్థానిక పీహెచ్‌సీకి 102 వాహనంలో తీసుకువచ్చి వైద్యపరీక్షల అనంతరం తిరిగి వారిని వారి ఇళ్లకు తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

కంపోస్ట్ షెడ్లను వినియోగంలోకి తేవాలి



గట్టుప్పల్ : కంపోస్ట్ షెడ్‌ను పరిశీలిస్తున్న డీపీఓ

గట్టుప్పల్ : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కంపోస్ట్ షెడ్ లాగానే అన్ని గ్రామ పంచాయతీల్లో కంపోస్ట్ షెడ్‌లను వినియోగంలోకి తీసుకురావాలని డీపీఓ కె.వెంకయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు రివ్యూ నిర్వహించి, అనంతరం కంపోస్ట్ షెడ్డును పరిశీలించారు. కంపోస్ట్ షెడ్డులో పొడి, తడి చెత్తలను వేరుచేయడం, ఎరువుల తయారిపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాలలో పారిశుద్ధ్యంపై కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఇంటి పన్నులు, డిమాండ్ నోటీసులపై కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మాధవరెడ్డి, కార్యదర్శులు షఫీ, శివ తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

మర్రిగూడ : గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీపీఓ వెంకయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన పర్యటించి మాట్లాడారు. గ్రామపంచాయతీలో పారిశుద్ధ్యానికి సంబంధించిన అన్నిరకాల సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఓటరు లిస్టు మెర్జింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతు వేదిక సమీపంలో ఉన్న నీటి నిల్వ ప్రాంతంలో కల్వర్టును నిర్మించేందుకు సమస్యను ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపుతామన్నారు. ఆయన వెంట ఎంపీఓ రవికుమార్, పంచాయతీ కార్యదర్శి యూసుఫ్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న టీఈఈ 1104 యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సాయిబాబు

నల్లగొండ : విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి 1104 యూనియన్ కృషి చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి సాయిబాబు అన్నారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీఎస్ఈబీ నుంచి 1990లో డిస్కమ్ కంపెనీలుగా విడగొట్టారని, ఆ సందర్భంలో ప్రైవేటీకరణకు పాల్పడ్డారని ఆరోపించారు. అప్పుడే ఒంటరిగా సంఘం పోరాటం చేసిందని, దీంతోనే విద్యుత్ శాఖ ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగుతుందన్నారు. విద్యుత్ ఉద్యోగులకు మేలు జరిగిందంటే అది కేవలం 1104 ఉద్యమ ఫలితమే అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కూడా తమ వాణిని వినిపించామన్నారు. టీఈటీయూఎఫ్‌గా ఏర్పడి కాంట్రాక్టు కార్మికుల ఉద్యమంలో కూడా సంఘం పెద్దన్న పాత్ర పోషించిందని దాంతోనే గత ప్రభుత్వం ఆర్టిజన్లుగా ఉద్యోగాలకు అవకాశం ఇచ్చిందన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రాంతీయ కార్యదర్శి ఎన్.వెంకటయ్య నివేదిక చదివారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు రేమనురి వెంకటేశ్వర్లు, కార్యనిర్వాహక అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, జి.వరప్రసాద్, జనార్దన్‌రెడ్డి, నల్లగొండ ఎస్ఈ ఆపరేషన్ వెంకటేశ్వర్‌రావు, డీఈ కృష్ణారావు, ఎస్ఏఓ సుచేందర్, అధికారులు సీవీ అన్నయ్య, విద్యాసాగర్‌రావు, వెంకటయ్య, శ్రీనివసచారి, ప్రభాకర్, పలువురు కంపెనీ అధ్యక్షులు వేణు, భాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు, సీతారాములు, రాంరెడ్డి, శ్రవణ్‌కుమార్‌లు హాజరయ్యారు. అనంతరం పలు తీర్మాణాలు చేశారు.



కార్యదర్శిగా ఎన్నికైన వెంకటయ్య

టీఈఈ 1104 యూనియన్ రీజనల్ కార్యదర్శిగా నిమ్మచెట్ల వెంకటయ్య

తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ రీజనల్ కార్యదర్శిగా నిమ్మచెట్ల వెంకటయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం పట్టణంలో జరిగిన సంఘం సర్వసభ్య సమావేశం అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి.జైపాల్‌రెడ్డి, కార్యదర్శిగా వెంకటయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వెంకటయ్య వరుసగా నాలుగోసారి కార్యదర్శిగా ఎన్నికయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్, అడిషనల్ సెక్రటరీలుగా టి.శ్రీనివాసులు, ఎల్.సీతారాములు ఎన్నికయ్యారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



యాత్రలో మాట్లాడుతున్న నాయకులు

నల్లగొండ టౌన్ : యువత డ్రగ్స్, గంజాయి, మద్యపానం వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్ అన్నారు. డ్రగ్స్, గంజాయి నిర్మూలన, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు రద్దు చేయాలని కోరుతూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సైకిల్ యాత్ర మంగళవారం నల్లగొండ పట్టణానికి చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి సామాజిక చైతన్యంతో సమాజ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో యువ చైతన్య సైకిల్ యాత్ర టీం మేనేజర్ పుల్లెంల శ్రీకర్, నన్నూరి వెంకటరమణారెడ్డి, భీమగాని గణేష్, గుండాల నరేష్, వడ్డగాని మహేష్, పాలాది కార్తీక్, పోకల శశిధర్, సుకుమార్, పగిళ్ల సాయి తేజ, రాజేష్, కిరణ్, వేణు, జాల ఆంజనేయులు, రఘువరన్, గోపి పాల్గొన్నారు.

పాఠశాలలో మోగిన నీటిగంట



నీటిని తాగుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మర్రిగూడ : విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా తమ పాఠశాలలో రోజుకు నాలుగుసార్లు నీటి గంట మోగిస్తున్నామని హెచ్ఎం ఉదావత్ లచ్చిరాం తెలిపారు. మంగళవారం పాఠశాలలో నీటి గంట మోగించి విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు నీటిని తాగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వై.మంజులత, సమావత్ వెంకట్‌కుమార్, కొండ శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫేస్ రికగ్నేషన్‌తో పింఛన్‌లు

చిట్యాల : రాష్ట్ర ప్రభుత్వం చేయూత పింఛన్ అందించేందుకుగాను బయోమెట్రిక్‌లో వేలిముద్రలు పడని వారికి నూతనంగా ఫేస్ రికగ్నేషన్‌తో పింఛన్లు అందిస్తున్నారు. మంగళవారం స్థానిక పోస్టాఫీస్‌లో పింఛన్‌దారులకు సిబ్బంది తమ మొబైల్‌లో ఫేస్‌లను రికగ్నేషన్ చేసి పింఛన్ డబ్బులు అందజేశారు. దీంతో అవకతవకలు జరగవని తెలిపారు.



లబ్ధిదారుడి ఫేస్ రికగ్నేషన్‌ను గుర్తిస్తున్న పోస్టాఫీస్ అధికారులు

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి వేడుకలు



రామగిరి(నల్లగొండ) : నాగులపుట్టకు పాలుపోసి పూజలు చేస్తున్న భక్తులు



నకిరేకల్‌లో పూజలు చేస్తున్న మహిళలు

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ పట్టణంలో నాగుల పంచమి వేడుకలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని బీటీఎస్ ఎల్లమ్మ గుడి, పానగల్లు ఎల్లమ్మగుడి, వీటీకాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో రద్దీగా మారాయి. ఆయా ఆలయాల్లోని పుట్టల వద్ద నాగదేవతకు పూజలు నిర్వహించారు. అనంతరం పుట్టలో పాముకు పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

నకిరేకల్ : పట్టణంలోని ఇసాయికుంట కట్ట వద్ద వెలసిన శ్రీరేణుక యల్లమ్మ ఆలయం పుట్ట వద్ద మంగళవారం నాగుల పంచమి వేడుకలను మహిళలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే మహిళలు పసుపు, కుంకుమ, పాలు, పెరుగు, నేవేధ్యం తెచ్చి పుట్ట వద్ద పూజలు చేశారు. ఈ వేడుకలను స్థానిక కాళికామాత దేవాలయం వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మదేవర రవిశంకర్ పర్యవేక్షించారు. వేడుకల్లో స్థానిక కౌన్సిలర్ యాసారపు లక్ష్మీవెంకన్న, మహిళలు పాల్గొని పూజలు చేశారు.



చిట్యాల : నాగుల పంచమి వేడుకల్లో పాల్గొన్న భక్తులు

చిట్యాల : పట్టణంలోని పాత శివనేనిగూడెంలో గల శ్రీఎల్లమ్మ తల్లి ఆలయంలో నాగుల పంచమి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలోని నాగులపుట్టలో పలువురు మహిళలు పాలు పోసి పూజలు చేశారు. కార్యక్రమంలో వార్డు మాజీ కౌన్సిలర్ సిలివేరు మౌనిక శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలల్లో ఈ నెల 31న స్పాట్ కౌన్సెలింగ్

నల్లగొండ : పట్టణంలోని జీవీగూడెం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభా కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బైపీసీలో మిగిలిన సీట్లలో ప్రవేశాలకు ఈ నెల 31న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ పి.లలితకుమారి మంగళవారం తెలిపారు. పదోతరగతిలో 70శాతం కంటే ఎక్కువ మార్కులు పొందిన వారికి అవకాశం ఉంటుందన్నారు. 31న ఉదయం 9గంటల నుంచి ఒంటిగంట వరకు రిజిస్ట్రేషన్ చేస్తామని, అనంతరం మధ్యాహ్నం 1గంట నుంచి 2 గంటల మధ్య మెరిట్ లిస్ట్ ప్రకటిస్తామని తెలిపారు.

చండూరు కళాశాలలో..

నల్లగొండ : చండూరులోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ గ్రూప్ ప్రథమ సంవత్సరంలో మిగిలిన సీట్లకు ఈ నెల 31న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ కె.అర్జున మంగళవారం తెలిపారు. ప్రవేశాలకు పదో తరగతిలో 420 మార్కుల కంటే ఎక్కువ వచ్చిన విద్యార్థులు అర్హులన్నారు. విద్యార్థులు పదోతరగతి ఒరిజినల్ టీసీ, మార్కుల మెమో, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, 3 ఫొటోలతో నేరుగా కళాశాలలో హాజరు కావాలని, అదే రోజు సాయంత్రం ఎంపిక జాబితా ప్రకటిస్తామన్నారు.

నార్కట్‌పల్లి : కట్టంగూర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్‌లో మిగిలిన సీట్ల ప్రవేశాలకు అవకాశం కల్పిస్తున్నట్లు ప్రిన్సిపల్ శమంతకమణి మంగళవారం తెలిపారు. ఎంపీసీ, బైపీసీలో మిగిలిన సీట్లకు ఎంపికైన వారికి సీట్లు కేటాయిస్తామని, మార్చి 2025లో పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 31న ఉదయం 9గంటలకు నిర్వహించే స్పాట్ కౌన్సెలింగ్‌కు టీసీ, బోనోఫైడ్, కుల, ఆదాయ, ఆధార్, రేషన్‌కార్డు, పదో తరగతి మార్కుల మెమో, 3 పాస్‌ఫొటోలు, 3సెట్ల జిరాక్స్ పత్రాలతో తెలంగాణ సాంఘీక గురుకుల బాలికల కాలేజి కట్టంగూర్‌కు హాజరు కావాలన్నారు. ఈ నెల 31న సాయంత్రం 4 గంటలకు అర్హుల జాబితా ప్రకటిస్తామన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నకిరేకల్ : పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీఈసీ గ్రూప్ సీట్ల భర్తీ కోసం ఈ నెల 31న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించునున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ జె.శోభారాణి మంగళవారం తెలిపారు. విద్యార్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఉదయం హాజరు కావాలని కోరారు. అదే రోజు సాయంత్రం జాబితా ప్రదర్శిస్తామని వెల్లడించారు.

అక్రమ డిప్యుటేషన్ రద్దు చేయాలి

నాంపల్లి : మండలంలోని నర్సింహులగూడెం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న హెచ్ఎంను మునుగోడు మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాల పులిపలుపులకు అక్రమంగా డిప్యూటేషన్ చేయడం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గేర నరసింహ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిప్యుటేషన్లతో పాఠశాలలను నిర్వీర్యం చేయడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారని అన్నారు.

కార్మిక చట్టాల పరిరక్షణకు ఉద్యమించాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

నల్లగొండ టౌన్ : కార్మిక చట్టాల పరిరక్షణ కోసం ఉద్యమించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు అన్నారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన ఏఐటీయూసీ అనుబంధ సివిల్ సప్లయ్ హమాలీ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు చెప్పినా ప్రభుత్వం అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలి రేట్లు లేవనీ, హమాలీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐటీయూసీ సీనియర్ నాయకుడు ఉజ్జినీ రత్నాకర్‌రావు, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, బి.మహేష్, దొనకొండ వెంకన్న, బి.మహేష్, నాగరాజు, అశోక్, కృష్ణయ్య, రఘు, శ్రీనివాసులు, రవి, శ్రీశైలం, రమేష్, శివ, ధర్మతేజ, లింగం, నాగార్జున, లింగస్వామి, గోపి, బాలస్వామి, శ్రీను, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

చిట్యాల : నాయీబ్రాహ్మణ కుల వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ జి.కృష్ణనాయక్‌కు ఆ సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు అంశల అనిల్‌కుమార్ మాట్లాడారు. 50ఏళ్లు నిండిన నాయీబ్రాహ్మణ కుల వృత్తిదారులకు ఆసరా పింఛన్‌లు ఇవ్వాలని, అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూం ఇండ్లు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని, ఎస్సీ కేటగిరిలో చేర్చాలన్నారు. అంతకు ముందు పట్టణంలో జరిగిన సమావేశంలో సంఘం మండల నూతన అధ్యక్షుడిగా వెలిమినేడు గ్రామానికి చెందిన అంశల అనిల్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమాలలో మండల మాజీ అధ్యక్షుడు అంశల శ్రవణ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు అమరోజు వెంకటేశం, దన్వంతరి నాయీబ్రాహ్మణ సొసైటీ అధ్యక్షుడు అమరోజు గోవర్ధన్, అంశల సత్యనారాయణ, జంపాల వెంకన్న, హరినాథ్, అమరోజు శ్రీరాములు, మునుగోటి మహేష్, వావిళ్ల క్రిష్ణయ్య, చికిలంమెట్ల సత్తయ్య, అక్కెనపల్లి సతీష్ కృష్ణ పాల్గొన్నారు.

నూతన కమిటీ ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

నల్లగొండ టౌన్ : పట్టణంలో మదర్ మ్యారేజ్ బ్యూరోస్ అసోసియేషన్ కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులు సంఘం కార్యాలయంలో బ్యూరోస్ ఫౌండర్ చైర్మన్ గోలి రజితారెడ్డి సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా గోలి భూపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కస్తూరి రాజు, కోశాధికారిగా సుంకం విద్యాసాగర్, క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా గుమ్మడవెల్లి శ్రీదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా విరమల ప్రకాష్‌గుప్తా, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా మన్యం సైదులుయాదవ్, వైస్ ప్రెసిడెంట్‌గా దేవరకొండ భాస్కరాచారి, వైస్ ప్రెసిడెంట్ మహిళా కస్తూరి లక్ష్మి, కన్వీనర్‌గా పిన్నింటి శ్రీనివాసరెడ్డి, కార్యదర్శిగా గుమ్మడవెల్లి శ్రీనివాసులు, డివిజనల్ ప్రెసిడెంట్ గార్ల శివయ్య యాదవ్, కార్యవర్గ సభ్యులుగా ముచ్చపోతుల స్రవంతి, నల్లవెల్లి బాలమణి ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో కేసాని కవిత, వేణుగోపాల్‌రెడ్డి, సూరెడ్డి సరస్వతి పాల్గొన్నారు.

కరాటే చాంపియన్ షిప్‌లో శివరాజ్‌కు ప్రథమ స్థానం



ట్రోఫీ, ప్రశంసాపత్రంతో శివరాజ్

శాలిగౌరారం : కేంద్ర పాలిత ప్రాంతమైన పాండిచ్చేరిలో ఈ నెల 26, 27తేదీల్లో జరిగిన 14వ పెమ్మా కప్ అండర్–21 జాతీయస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో మండలంలోని అడ్లూరు గ్రామానికి చెందిన వరికుప్పల శివరాజ్ ప్రథమ స్థానంలో నిలిచాడు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి 1500మంది పోటీల్లో పాల్గొనగా తెలంగాణ రాష్ట్రం నుంచి అవినాష్ స్పోర్ట్స్ కరాటే అకాడమీ నుంచి శివరాజ్ పాల్గొన్నారు. జాతీయస్థాయి కరాటే పోటీలు కటాస్, స్పైరింగ్ విభాగాలలో జరుగగా శివరాజ్ స్పైరింగ్ విభాగంలో ప్రథమ స్థానం సాధించారు. ఈ సందర్భంగా శివరాజ్‌కు క్రీడా పోటీల నిర్వాహకులు చాంపియన్‌షిప్ ట్రోఫీతో పాటు ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివరాజ్‌ను తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు. ఇదిలా ఉండగా కరాటేలో శివరాజ్ అండర్–16లో రెండుసార్లు, అండర్–17, అండర్–18లో ఒక్కొక్కసారి జాతీయస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి చాంపియన్‌షిప్‌లు అందుకున్నారు.